# అతివలూ - ఆకాంక్షలూ

ఉమాదేవి

కథానిక

"లతా! లతా!" అంటూ ఆఫీసు నుంచి ఎంతో ఉత్సాహంగా వచ్చాడు రామారావు

"ఈ రోజునుంచి సరస్వతీలో 'పరిణీత' పిక్చరు మొదలయింది లతా వెళ్దామా?" అని కోటు విప్పుకుంటూ భార్య ముఖంలోకి చూచాడు. శ్రీలత ముఖంలో ఉత్సాహపు ఛాయ లేవీ కనిపించలేదు సరికదా, ముడుచుకున్న పెదవులతో దించిన కనురెప్పలతో సాక్షాత్తూ అలకాదేవిలా అలాగే కోటు అంది పుచ్చుకుని లోపలికి విసవిసా నడిచింది. రామారావులోని ఉత్సాహమంతా క్షణంలో నీరయిపోయింది. అయినా అధీరుడు కాకుండా ఆమె వెంటే లోనికి నడిచాడు.

మౌనముద్రతో లత అందించిన కాఫీ తాగుతూనే మెల్లిగా—

"ఏం లతా. మీ సాకుమారి నీ అభిమాన తారేగా; పైగా పరిణీత వస్తోందని విన్నప్పటినుంచే చూడాలని ఎంతో సరదా పడ్డావు. ఇప్పుడిలా ఉన్నావేం?" అన్నాడు నొచ్చుకుంటూ.

"ఆ! అన్ని సరదాలూ తీరుతున్నాయి గనక యిదొక్కటీ తీరదనా!" అని పెటుసుగా జవాబిచ్చింది శ్రీలత.

రామారావు మనస్సు చివుక్కుమంది. తను లతకు ఒక్క విషయంలో తప్ప మరెందులో లోపం చేస్తున్నాడు! అయినా తాను కొని పెట్టవలసినవి కూడా లత కేమీ లేవే! గొప్పయింటి ఆడపడుచు అన్నీ కన్నవారే యిస్తారు. చేతినిండా ఎప్పుడూ డబ్బు ఉండనే ఉంటుంది. తను కూడా జీతం రాగానే లత చేతికే యిస్తాడు కదా. తమ సంసారంలో లత చేతికి ఏ అడ్డూ లేదు. అయినా యీ ప్రవర్తన ఏమిటో! ఒక్క విషయానికి సహించి క్షమించి సరిపెట్టుకోలేదు కాబోలు! అనుకున్నాడు. చిన్నబుచ్చుకునే. "పోనీలే లతా. నీ సరదాకోసం రాకపోయినా నా సరదాకోసమే అనుకో; రాకూడదా?" అన్నాడు దీనికి జవాబు యింకా పెడసరంగా వస్తుందనుకుంటూనే. కానీ యిందుకు లత అసలే జవాబు యివ్వలేదు.

నిస్పృహతో రామారావు బైటికివచ్చి అరుబైట వాల్చిఉన్న పడకకుర్చీలో మేనువాల్చాడు.

లత లోపలికి వెళ్ళి పని చేసుకుంటున్నట్లు ఆ గదిలోంచి యీ గదిలోకీ వంటింట్లోంచి దొడ్లోకీ ఊ తిరుగుతోందన్న మాటేగాని ఆమె మనస్సు మనస్సులో లేదు. అనవసరంగా అతని మనసు నొప్పించానేమో అని బాధపడుతోంది. అతని చిన్నబోయిన వదనం చూడగానే ఆమె హృదయంలో ముల్లు గుచ్చుకున్నట్లయింది. తనప్రవర్తనను తనే గర్హించుకుంది... రామానికి తనంటే నిజంగా ఎంత ప్రేమ! తనకు మాత్రం తక్కువ ఉందేమిటి!

తాను యింటరు చదువుతోంది అప్పుడు... రోజూ సాయంత్రం ట్యూషను చెప్పించుకుని యింటికి తిరిగి వచ్చేవేళకి మూల మలుపున ఉన్న కొత్తగా కడుతూ ఉన్న డాబా యింట్లోంచి శ్రావ్యమైన మురళీ నాదం వినిపించేది. అప్రయత్నంగా తన గమనం మందగించేది. అంత మధురంగా వాయించే వ్యక్తి పెద్దవాడో, చిన్నవాడో, స్త్రీయో పురుషుడో కూడా తెలియని స్థితిలో—ఎవరయిందీ తెలుసుకోవాలని మహా కుతూహలంగా ఉండేది. పైగా

తన కోసమే వాయిస్తూ ఉన్నట్లుగా సరిగ్గా తను వచ్చేటప్పటికే ఆ గానం వినిపించేది!—

ఆ రోజు తన క్లాసులో ఒక కొత్తమ్మాయి చేరింది. గుంటూరునుంచి టీ. సి. తీసుకుని వచ్చిందట ఆ పిల్లదీ తన గ్రూపే! సాయంత్రం యిద్దరూ కలిసి కాలేజీనుంచి యింటికి వచ్చేటప్పుడు ఆ అమ్మాయి ఆ డాబా యింట్లోకే వెళ్ళింది. శ్రీలతకు ఆశ్చర్యం వేసింది. ఒకవేళ యింతకు ముందున్నవారు ఖాళీచేసి వెళ్తే యీ రమా వాళ్ళు వచ్చారేమోలే అనుకుంది... కాని ఏడింటికి మళ్ళీ ట్యూషను తీసుకుని యింటికి తిరిగి వచ్చేవేళకు అదే మురళీనాదం!... నాలుగు రోజులు ఆపుకుంది. కానీ యిక తన ఉత్కంఠను ఆపుకోలేక "రమా! మీయింట్లో రోజూ ఫ్లూటు వాయించేదెవరోయ్" అని అడిగేసింది. రమ నవ్వుతూ "మా అన్నయ్యేలే. వాడికదొక సరదా. కాలేజీనుంచి సరాసరి యింటికి రాగానే కాసేపు అటూ యిటూ తిరిగి యీ ఫ్లూటు సాధకం మొదలెడతాడు" అంది.

శ్రీలతకు ఏమనిపించిందో చెప్పటం కష్టం. ఇంత బాగా వాయించేవాడు యింకెంత అందంగా ఉంటాడో అనుకుంది. నిజంగా యిది అర్థంలేని ఆలోచనే! వాయిద్యానికీ మనిషి అందానికీ సంబంధమేముందీ? కానీ ఆ వయసులో సందర్భరహితంగా నవ్వటం... అర్థశూన్యంగా మాట్లాడటం... గట్టిగా మాట్లాడితేనే కళ్ళనిండా నీళ్ళు తిప్పుకోటం... సమన్వయం కుదరకుండా ఊహించుకోటం అందరూ చేసేపనే! అందుకే రమ అన్నయ్య అందంగానే ఉండి ఉంటాడని శ్రీలత ఊహించుకుంది. క్రమంగా రోజులు గడిచేకొద్దీ రమామణీ, శ్రీలతా సన్నిహితులవటం మొదలుపెట్టారు... ఒకరింటి కొకరు రాకపోకలు కూడా సాగించారు. కానీ ఏనాడూ రమావాళ్ళ అన్నయ్యని చూడటం శ్రీలతకు సందర్భపడనేలేదు.

• • •

రమ తన పుట్టిన రోజునాడు పండుగ చేసుకుంటూ స్నేహితురాళ్ళ నందరినీ విందుకు ఆహ్వానించింది. శ్రీలత కూడా చక్కని పర్సొకటి స్నేహితురాలికి బహూకరించింది. విందులో ప్రధానవ్యక్తి శ్రీలతే!

విందు ముగిసిన తరువాత రమ వాళ్ళన్నయ్య రామారావును తీసుకొచ్చి అందరికీ పరిచయం చేస్తూ 'యివాళ మా అన్నయ్య ఫ్లూటు వాయించి మనందరినీ ఎంటర్‌టైన్ చేస్తాడు' అంది. రామారావు సిగ్గుపడిపోయాడు, యింతమంది అమ్మాయిల మధ్య కూర్చోటానికి. చెల్లి బలవంతంమీద రామారావు తన మధురగానంతో అందరినీ ఓ అరగంటసేపు తన్మయత్వంలో ముంచివేశాడు. పార్టీ ముగిసింది... శ్రీలత మనసంతా రామారావుని గురించిన ఆలోచనలతోనే నిండిపోయింది. నిజంగా అతడు రమకంటే కూడా ఎంతో అందంగా ఉన్నాడు. యింజనీరింగు ఆఖరు సంవత్సరం చదువుతున్నాట్ట. ఎంత బాగా వాయించాడు మురళి! రామారావనే కంటే మురళీకృష్ణ అంటేసరిపోతుందేమో.. అనుకుంది శ్రీలత. రోజులు దొర్లిపోయేకొద్దీ తాను రామారావును ప్రేమిస్తున్నానని శ్రీలతకు విశదమవసాగింది. సర్వసామాన్యంగా ప్రేమికులు తమ ప్రియతముల ప్రతి చర్యనూ అనుక్షణమూ గమనించాలని తహతహ లాడిపోతారు... ఎప్పుడూ వారినే స్మరించుకుంటూ వారి అభిరుచులన్నీ తెలుసుకుని తమలోనూ అలాంటి అభిరుచులే డెవలప్ చేసుకోవాలని ప్రయత్నిస్తారు. వారిని గురించి తియ్యతియ్యగా ఊహించుకుంటూ స్నేహితులకు తమ ప్రియతములను గురించి చెప్పిందే చెబుతూ బోర్‌చేసి మరీ వదులుతారు. వారిని గురించి సాధ్యమయినన్ని వివరాలు సేకరించుతారు. అయితే లత యిందులో ఏ ఒక్కటీ చేయలేదు. మీదుమిక్కిలి వాళ్ళయింటికి వెళ్ళటంగూడా తగ్గించింది.

ఏమయితే యేం — వాళ్ళిద్దరికీ రాసిపెట్టివుంది. రామారావు అదృష్టమే అనుకోండి శ్రీలత సుకృతమే కానియ్యండి. వాళ్ళ తల్లిదండ్రులకే ఆ సంకల్పం కలిగి యిద్దరికీ వివాహం చేసేశారు ఓ శుభముహూర్తాన. నిజానికి శ్రీలతగాని రామారావుగాని కలుసుకుంటూ తమ ప్రేమ యితరులకు తెలిసే విధంగా సంచరించే ఉంటే యీ సంబంధమే తల్లిదండ్రులకు కోపకారణమయేదేమో. కాని పెద్దవాళ్ళకి యీ ఆలోచన రావటాన ఏ ఆటంకమూ రాలేదు. శ్రీలత భాగ్యం, అందం, రామారావు తల్లిదండ్రుల నాకర్షించాయి.

రామారావు చదువూ సద్గుణాలూ శ్రీలత పెద్దల నాకర్షించాయి... వారడిగిన కట్నం కానుకలూ వీరివ్వటానికి ఒప్పుకున్నారు. ఇక పేచీయేముంది!

వధూవరులు తమ ప్రేమను తీరిగ్గా పెళ్ళి అయిన తరవాతే ఒకరికొకరు నివేదించుకున్నారు. తమ అదృష్టానికి తమ్ము తామే అభినందించుకున్నారు. మరి కొద్దిరోజుల్లోనే రామారావుకు ఉద్యోగం కూడా అయేసరికి కొత్త కోడలు సాక్షాత్తూ లక్ష్మీదేవే అని అత్తమామలు తెగ మురిసి పోయారు. లతా, రామారావూ ఉద్యోగపు ఊరికి వెళ్ళిపోయారు.

* * *

చిన్నప్పటినుంచీ కూడా శ్రీలతకు సిగరెట్ కాల్చేవాళ్ళంటే మహాసరదాగా ఉండేది. ఎవరైనా సిగరెట్ కాలుస్తూ ఒకచేత్తో కాలుతూ ఉన్న సిగరెట్ పుచ్చుకుని ఆ పొగ అదో పోజులో వదులుతూ వయ్యారంగా నడుస్తూవుంటే ఎంత వద్దనుకున్నా అటువైపే చూడాలనిపించేది తనకు.

అప్పటికి తనకు బాగా ఊహ తెలుస్తోంది... ఆ రోజుల్లో థర్డుఫారం చదువుతున్న తను ఒక పండక్కి అమ్మమ్మగారింటికి వెళ్ళింది. అది బుల్లి మామయ్య భార్య భాను కాపరానికి వచ్చిన తొలి దినాలు. మామయ్య విపరీతంగా సిగరెట్టు కాల్చేవాడు. ఇంట్లో వున్నంతసేపూ సిగరెట్ అయిపోయినప్పుడల్లా "భానూ! భానూ" అంటూ లోపలికి పరిగెత్తుకొచ్చేవాడు. ఎంత పని చేస్తున్నా ఎందరిలో ఉన్నా భాను గదిలోకి వెళ్ళి సిగరెట్ వెలిగించి పెట్టి రావాల్సిందే. వాళ్ళ చేష్టలు దూరాన్నించి చూస్తున్న లతకు వింతగా కనుపించేది. అలాంటి సందర్భాలలోనే ఒకరోజు భాను సిగరెట్ అంటిస్తూ ఉండగా ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూచుకోటంలో తన్మయులై పోయిన ఆ దంపతులిద్దరికీ భాను చెయ్యి చురుక్కున కాలిందాకా తెలిసేరాలేదు! చివరికి ఉండబట్టలేక అడిగేసింది శ్రీలత.

"ఏమత్తయ్యా? మామయ్య వెలిగించుకోలేడూ? నీవే అంటించాలా!" అని అమాయకంగా కొంచెం చిరాకుగా—మరికొంచెం కుతూహలంతో. అందుకు భాను ఏమందో తెలుసా—నవ్వుతూ "రేపు మీ ఆయన వచ్చాక ఆయన్ను యిలాగే అను — జవాబేమిస్తాడో విందువుగాని" అంటూ మేనకోడలి బుగ్గలు సున్నితంగా సాగతీసింది. ఈ చిలిపి పిల్ల లేత బుర్రలో యింతలేసి ఆలోచనలెలా మెదుల్తున్నాయా అని లోలోపలే అచ్చెరువు చెందుతూ.

తరువాత వాళ్ళ ఊరొచ్చాక తన స్నేహితురాలు పద్మతో యీ సంగతి ఎంతో వింతగా చెప్పింది శ్రీలత.

"అదేమోనోయ్ మా అన్నయ్యకూడా ఇలాగే మొదలెట్టాడు. అంతా అలాగే చేస్తారు కాబోలు!" అందిపద్మ యింకా ఆశ్చర్యం వెల్లడిస్తూ.

ఆ నాటి నుంచీ శ్రీలత హృదయఫలకం మీద ఆ దృశ్యం ఎనామిల్ పెయింట్‌తో చిత్రించిన చిత్తరువులా చెరక్కుండానే ఉండిపోయింది.

తనకు పెళ్లయితే తనభర్త కూడా సిగరెట్ కాల్చేవాడుగానే ఉండాలి... సరదాగా తనూ అతన్ని సిగరెట్ అంటించుకోనీయదు. భాను అత్తయ్యలా, పద్మగారివదినలా తనే అంటిస్తుంది... యింకా యింకా ఏవేవో యిలాంటివే పగటికలలు కంటూ ఉండేది. కాలేజీ స్టూడెంట్సు సిగరెట్ కాలుస్తూపోతూ అమ్మాయిలముందు తిరుగుతున్నప్పుడల్లా తన స్వప్నసుందరుణ్ణి తలచుకుని తనలో తాను సన్నగా ముసిముసి నవ్వులు నవ్వుకునేది...

అయితే ఆమె కలలన్నీ కూడా యీ రామారావు మూలాన పూర్తిగా భగ్నమయిపోయాయి. తన సరదామాత్రం తీరకుండానే నిలచిపోయింది. ఒక ఆదర్శ వ్యక్తికి ఉండవలసిన లక్షణాలన్నీ తన భర్తలో ఉన్నాయి. కాని ఏంలాభం! అతనికి సిగరెట్టంటేనే మహా రోతగదా! వారింట్లో ఎవరూ కాల్చరు. వారి కుటుంబపద్ధతే అలాంటిది మరి. అదే విధంగా చిన్నప్పటినుంచీ కూడా సిగరెట్‌ను ద్వేషిస్తూనే పెరిగాడు. ఆ వాసనకూడా అతనికి గిట్టదు. సినిమాకు వెళ్ళినా అక్కడున్న రెండు మూడు గంటలూ చేతిరుమాలు ముక్కుకు అడ్డంపెట్టుకునే కూర్చుంటాడు... తనభర్త చక్కగా ఖరీదైన సిగరెట్లు కాలుస్తూఉంటే అలలు అలలుగా పైకి తేలిపోయే పొగలో తానూ తేలిపోయి ఏవేవో లోకాలలో విహరించాలని భ్రాంతిపడేది శ్రీలత. ఆమెకు ఒకటే చింత—ఎంతకీ తెగని సమస్యకూడా అదే—తిండికి గడవనివాడు కూడా ఎంగిలి బీడీ

లయినా ఏరుకుని కాల్చేటప్పుడు యింత డబ్బుండీ రామారావు ఎందుకని సిగరెట్లు కాల్చడా అని! ఆమె దృష్టిలో సిగరెట్లు కాల్చలేనివాడంటే నాగరికత తెలియనివాడు. అక్కడికీ భర్తను స్మోకింగ్ అలవాటు చేసుకోమని ఎంతగానో అడిగింది—బ్రతిమాలింది — ప్రాధేయపడింది. కానీ ఎప్పుడూ "నాకు ఆ వాసనే గిట్టదు లతా" అని నవ్వుతూ మృదువుగా రామారావిచ్చే జవాబు వింటే లతకు ఒళ్ళు మండిపోయేది. చివరకు యిలా సూటీపోటీగా చెప్పటం మొదలుపెట్టింది... కాని అవధిలేని అతని ప్రేమను తలచుకున్నప్పుడల్లా తన ప్రవర్తనను తనే సిగ్గుపడి అసహ్యించుకునేది.

"హీ—ఆయన అంత సరదాపడి సినిమాకు వెళ్దామంటే నేనెందుకు కాదనాలి? సినిమాలంటే పెద్ద మోజులేకపోయినా నాకు యిష్టమని తెలిసే కదా ఆయన అంతగా రమ్మంటున్నారు" అనుకుని చక్కగా ముస్తాబయి అతనిదగ్గరకు వచ్చింది.

'సినిమాకు వెళ్దామన్నారుగా—బయలుదేరండి మరి. టైమవటంలేదూ?" అని అతని దృష్టినుంచి తన చూపులు తప్పించుకుంటూ ఎటో చూస్తూ అంది. రామారావు చిత్రంగా భార్యవైపు చూచాడు. శ్రీలత యింత త్వరలోనే కోపం పోయి సుముఖురాలవుతుందనుకోలేదు తను... ఆమె అలంకరణలో ఎప్పుడూ ఏదో ప్రత్యేకత ఉంటూనే ఉంటుంది. సాధారణంగా కనిపించేలాగే ఉంటుంది. మళ్ళీ అందులో దర్జాగానూ ఉంటుంది.—"ఇంత అందమైన పిల్లకు ఆ చిరాకు ఎందుకు కలిగించాడా భగవంతుడు!" అని ఆలోచిస్తూ ఆమెను చూస్తూ అలాగే కదలకుండా మెదలకుండా పడుకున్నాడు.

"ఏమండీ సినిమా ప్రయత్నం విరమించుకున్నట్లేనా?" అంది లత యీ జాగు భరించలేక.

"ఆహా! యిలా నిన్ను చూస్తూ పడుకుంటే చాలదూ వెధవ సినిమా దేనికి."

"చాల్లెండి సంతోషించాం గాని యిక్కడ మీ పొగడ్తల కెవరూ ఉబ్బిపోరు—బయలుదేరండి."—అందేగాని లోలోపల ఆనందిస్తూనే అతనికి బట్టలు యివ్వటానికి యింట్లోకి వెళ్ళింది. రామారావు కూడా ఆమె వెనకాలే వెళ్ళి త్వరగా డ్రెసప్ అయి భార్యతో థియేటరు వైపు బయలుదేరాడు.

ఇంటర్వెల్‌లో నాలుగు వైపులా కలయజూచింది లత. ఏ మూల చూసినా సిగరెట్లు తాగేవారే. హాలంతా పొగతో నిండిపోయింది. మరో మూల యిద్దరు కాలేజీ కుర్రాళ్ళు అతి ధోరణిగా ఏదో వాగేస్తూ దర్జాగా వెనుక వరసలో కూర్చున్న అమ్మాయిల ముఖాలమీదకే పొగ వదులుతున్నారు. పక్కకు తిరిగి ఏదో అనబోయి భర్తకేసి చూసింది. అతడేమో యథాప్రకారంగా రుమాలు ముక్కుకు అడ్డం పెట్టుకుని తలవంచుకుని కళ్లుమూసుకుని సమాధిలో ఉన్న అజగరానంద స్వామిలాగా కూర్చున్నాడు. విచారంతో నిట్టూర్చింది శ్రీలత.

సినిమా అయిపోయి వచ్చేటప్పుడు త్రోవలో "పిక్చరెలావుంది లతా?" అన్నాడు రామారావు. ఆ కూపంలోంచి బయట పడ్డందుకు స్వేచ్ఛగా నిట్టూరుస్తూ చల్లగాలి హాయిగా పీల్చుకుంటూ—రామారత్నాన్ని అలుకదీర్చి సినిమాకు తీసుకు రాగలిగాను కదా అనే విజయగర్వం ఆ కంఠంలో ప్రస్ఫుటమవుతోంది.

"బాగానే ఉంది" అని ముక్తసరిగా తేల్చేసింది లత. ఎప్పుడూ సినిమాను గురించి అడగ్గానే పక్కా అరగంటయినా లెక్చరిచ్చే యీ మనిషి యిప్పుడిలా చేసిందంటే మళ్ళీ ఏదో వచ్చిందిరా బాబూ! అనుకుని లోలోపలే బెదిరిపోయాడు రామారావు.

భార్య అసంతృప్తికి కారణం రామారావుకు తెలియకపోలేదు. కానీ ఏం లాభం? తాను అందరిలాగా కాకుండా బుద్ధిమంతుడని తల్లీ చెల్లెలూ మెచ్చుకునేవాళ్లు—సిగరెట్లూ అలాంటి దురలవాట్లు లేకపోవటాన. ఆ సుగుణమే తనను యీనాడు భార్యముందు వట్టి అసమర్థుడిగా నిరూపించింది. ఇతరత్రా ఎన్నోవిధాల లతను సంతోషపెట్టాలని ప్రయత్నించాడు. కాని ఫలితం మాత్రం కనుపించలేదు.

• • •

ఆ ఏడే రామారావు చిన్న చెల్లెలు ప్రమీల పెళ్ళికూడా కలిసి వచ్చింది. వారంరోజులు ముందుగానే యిటునుంచి రామారావూ, లతా అత్తవారింటినుంచి రమా, ఆమె భర్త మాధవరావూ వచ్చారు. పెళ్ళికి వచ్చిన యితర బంధువుల్లో

రామారావు పెత్తండ్రి కొడుకు రాజారావు కూడా ఉన్నాడు. వచ్చినరోజు సాయంత్రం రాజారావూ రామారావూ అలా షికారుగా బీచివైపు వెళ్ళారు. తోవలో—

“ఏంరా రామూ? ఎలావుంది వైవాహిక జీవితం?” అన్నాడు రాజారావు.

“ఏం చెప్పమంటావన్నయ్యా? నాకు మాత్రం చాలా దుర్భరంగా ఉంది” అన్నాడు దిగులుగా రామారావు.

ఆశించని యీ సమాధానంతో షాక్ తిన్నట్లయింది రాజారావుకి.

“అదేమిటిరా! చక్కని చుక్క—బాగా చదువుకున్న భార్యే వచ్చిందాయె! పుట్టింటివారూ కావలసినంత డబ్బు పంపుతారు కదా—నీకేమో నెల తిరిగేసరికి రెండు వందలు జీతం—యిల్లు వెతుక్కోవాల్సిన బాధకూడా లేకుండా హాయిగా ఎక్కడికి వెళ్తే అక్కడ గవర్నమెంటు క్వార్టర్సు యిస్తారయ్యె. యింకేం లోపంరా!” అన్నాడు. ఇంతకంటె సాధారణంగా మానవుడైన వాడికి ఎదురయ్యే సమస్యలు వేరేవీ లోకంలో లేనట్లు.

“ఇన్ని వున్నా శ్రీలతను సంతోష పెట్టలేకపోతున్నాను. వచ్చిన చిక్కే అది.”

“కారణం ఏమిటో?” కుతూహలంగా అడిగేశాడు రాజారావు.

“చెప్తే నవ్వుతావేమోరా అన్నయ్యా...”

“ఒరేయ్ రాముడూ—వెధవ సస్పెన్సులో పెట్టి చంపక ఆ చెప్పేదేదో త్వరగా అఘోరించు... ఏదో ఆలోచన త్వరగా చూద్దాం” అన్నాడు తన పూర్వపు ధోరణిలో.

“ఏం చూస్తావు? శ్రీలతకు సిగరెట్లంటే తగని వెర్రి. నన్ను సిగరెట్లు కాల్చమని హమేషా వేధిస్తోంది. మన యింటి సంగతి తెలుసుగా నీకు—చిన్నప్పటినుంచీ ఎలా సిగరెట్‌ను ద్వేషిస్తూ పెరిగామో. అందువల్ల ఆలా కాల్చలేక పోతున్నా కాబట్టి తీరని అసంతృప్తితో బాధపడుతోంది. స్మోక్ చేసే భర్తలతో వేగలేక ఎందరో స్త్రీలు బాధపడుతోంటే లత పరిస్థితి అందుకు సరిగ్గా వ్యతిరేకంగా వుంది అన్నయ్యా” బాధగానే అన్నాడు రామారావు.

చివర కంటావిని రాజారావు బిగ్గరగా నవ్వాడు.

“ఒరే అన్నయ్యా—నీకు నవ్వుగానే ఉంటుందిరా—అందుకే చెప్పకూడదనుకున్నాను” అన్నాడు రామారావు ఉడుకుమో త్తనం పెరిగిపోయి.

“కాదురా రామూ! నేనూ సరిగ్గా అదే స్టేట్‌లో ఉన్నారా... మీ వదిన ఇలాగే సాధిస్తోంది... ఏంచెయ్యడమా అని ఆలోచిస్తున్నాను... అసలు యీ ఆడవాళ్ళతో వచ్చిన బాధే యిదిరా. ఏది లేదో అదే కావాలంటారు!” అని ఒక్కసారిగా జనరలైజ్ చేసి పారేశాడు రామారావు.

“బలే బాగుంది—యిద్దరికీ తమాషాగా ఒకే బాధవచ్చి పడిందే! ఇంక మార్గాంతర మేముంది? చావో బ్రతుకో సిగరెట్ ఎలాగైనా అలవాటు చేసుకోవాల్సిందన్న మాటేగా?”

“ఆహా! గృహంలో శాంతి భద్రతలు నెలకొల్పాలంటే, యిల్లాలి కన్నీరు నట్టింట ఒలికించకుండా ఉండాలంటే, అక్షరాలా అంతే చేయాలి. మెల్లిగా ఎవరి దగ్గరకైనా వెళ్ళి నేర్చుకుందాం. ఒకటికి రెండుసార్లు కాలిస్తే అదే అలవాటయిపోతుందట... లేమరి బాగా చీకటి పడింది. ఇంక యింటికి పోదాంపద. వాళ్ళంతా మనకోసం ఎదురుచూస్తూ ఉండిఉంటారు” అని లేచాడు రాజారావు.

అన్న చేతి ఆసరాతో రామార్రావు కూడా లేచాడు. ఇసుక దులుపుకుంటూ పిచ్చాపాటీ కబుర్లు చెప్పుకుంటూ యింటికి చేరారు వీరపురుషులిద్దరూను.

* * *

భోజనాలయాక పెరట్లో వాల్చిన మంచాల మీద ఆసీనులయారు. అన్నదమ్ములిద్దరూ, దగ్గర్లోనే రమకూడావచ్చి కూర్చుంది. అన్నగార్లతో మాట్లాడటానికి...

“ఏం రమా మీ కాపురం విశేషాలేమిటి?” అన్నాడు రాజారావే.

“ఎలా చెప్పమనేది రాజన్నయ్యా. నా గొంతుకోశారు. ఆయనగారు తెచ్చే నూటయాభై ఆయన సిగరెట్లకీ హోటళ్ళకే చాలదనిపిస్తుంది. నాకేమో ఆ వాసనే గిట్టదు! ఎంతగానో బ్రతిమాలాను మానండీ ఆ పాడు సిగరెట్లు యిల్లు గుల్ల వళ్ళుగుల్ల అని. ఆయనకేమో అలవాట

యిందట, మానటం వారితరంకాదట!" అంది రమ గునుస్తూ షికాయితు చేసేధోరణిలో.

"ఆ! మీ ఆయన సిగరెట్ కాలుస్తాడన్న మాట!!" ప్రాణం లేచి వచ్చినట్లయి రామారావు అడిగేశాడు కట్టలు తెంచుకున్న ఆశ్చర్యంతో.

"కాస్తాకూస్తా అయితే నయమే—చైన్ స్మోకర్" రాజారావు రామారావువైపు చూచాడు. రామారావు శ్రీలత వైపు చూసి నవ్వుతూ,

"మీ లతకు చెప్పు రమా. నన్ను సిగరెట్లు కాల్చమని రోజూ వేధిస్తూ ఉంటుంది" అన్నాడు. బావగారిముందు తన సంగతి బైటపెట్టినందుకు లత కోపంతో మొహం తిప్పుతూ అవతలకు వెళ్ళిపోయింది.

"అయ్యో తెలివితక్కువా అని! ఒకసారి అలవాటైతే యిక మానమన్నా మానలేరు. అదీ ఘనకార్యమేనా!"

"అదేమో మాకు తెలీదు. బావగారిని అడగాలి ఆ బ్రహ్మవిద్య ఎలా నేర్చుకున్నారో. శుశ్రూష చేసి అయినా సరే నేర్చుకుంటాము, గురుదక్షిణకూడా యిస్తాము కావలిస్తే" అన్నారిద్దరూ హుషారుగా.

"అదేమిటి! ఇద్దరూనా ఏమిటి!! తాచెడ్డకోతి వనమెల్లా చెరిచిందని ఆనందిస్తూ బాగానే నేర్పుతారు. బాగుపడటం కష్టంకాని చెడిపోవటం తేలికేగా" అంది రమ దీర్ఘాలుతీస్తూ అరిందాలాగా.

• • •

ఎలాగైతేయేం పెళ్ళికి ఉన్న వారంరోజుల్లో రాజారావూ రామారావూ ఎన్నో శ్రమలకోర్చి భార్యాప్రీత్యర్థం ధూమపానం చేయటం నేర్చుకున్నారు. దేవతలు అమృతం సాధించినప్పుడైనా అంత ఆనందం పొందరో లేరోకాని వీరిద్దరూ మాత్రం యిప్పుడు బ్రహ్మానందపడ్డారు. వాళ్ళుపడ్డ అవస్థలన్నీ వర్ణించాలంటే అదో పెద్దగ్రంథం అవుతుంది.

ఇప్పుడు శ్రీలతకు చేతినిండా పనే! అప్పుడప్పుడూ కొద్దిగా పైకి విసుక్కుంటూ ఉంటూంది కూడా. "ఏమిటండీ మీరే వెలిగించుకోకూడదూ!" అని. అయితే రామారావు పెంకిగా "నేను వెలిగించుకోటానికేనా యింతటి శ్రమపడి నేర్చుకుంది" అన్నట్లు చూడగానే శ్రీలత సిగ్గుతో తల వంచుకుంటుంది. తాను కాబట్టి భర్తను లొంగదీసుకుని తన మాట వినేలా చేసుకోగలిగింది గదా అని తృప్తితో తనలో తాను నవ్వుకుంటుంది. ★

---

(8వ పేజీ తరువాయి)

లక్షలమంది వుండగా పొలాలలోని పంటలను ఇంటికి చేర్చుకొని, నిల్వపోసుకొనే భూస్వాములు కనీసం కొన్నివేలమంది వున్నారు. వీరికి ఆర్థికస్తోమత కలదు కనక వెంటనే ధాన్యం అమ్మవలసిన అవసరం వుండదు. బ్యాంకీలనుంచి అప్పులు చేయవలసిన అవసరం లేదుకాని, "లోనుచేసి" కొంత మొత్తాలు పుచ్చుకోవడం కద్దు. చివరకు వారే చిన్నరైతులకు తిండికి కావలసిన గింజలు హెచ్చుధరకు సప్లయిచేస్తారు. ఈవిధంగా గ్రామాలలో కొంతవరకు భూస్వాములవల్లనే ధరలు పెరిగిపోతున్నవి. అధికోత్పత్తి జరిగినా సరుకు మార్కెట్టుకు చేరక స్తంభించిపోయినందున ధరలు హెచ్చుతున్నవి. ఈవిధంగా ధాన్యం మార్కెట్‌ను, సప్లయిలను బిగబట్టి భూస్వాములు కంట్రోలు చేస్తున్నారు.

ఈస్థితిని అరికట్టాలంటే వీరిద్వారా స్తంభించిపోయిన ఈ నిల్వలను మార్కెట్‌కు రప్పించాలి. అందుకు ప్రయివేటు ఆస్తి హక్కులు అడ్డు రాగలవు. కంట్రోలు అమలు జరపాలి. అందువల్ల అవినీతి పెరుగుతుందని భయం. చౌకడిపోలు పెడితే సరిపోతుంది. దానివల్ల ప్రయివేటు వ్యాపారం దెబ్బతింటుందని ఆందోళన జరుగుతున్నది. కనకనే కనీసం సన్నరైతులకు ఆర్థికస్తోమతను పెంచి వారిని మార్కెట్‌కు రావలసిన అవసరం లేకుండా చేసినప్పుడు భూస్వాముల ఆట కొంతవరకు అరికట్టవచ్చు. అందుకు అధికోత్పత్తి ఫలితం సంఘంలో సమంగా పంపిణీ జరిగేటట్టు చేయాలి. అందుకోసమైనా భూసంస్కరణలు అవసరమే. స్వయంపోషకంలేని సన్నరైతుకు కొంత పొలం ఇచ్చి స్వయంపోషకం చేస్తే, వ్యవసాయ రంగంలోని ఉత్పత్తిదారు, మార్కెట్‌కు వెంటనే కొనుగోలుదారుగా రావలసిన అవసరం తప్పుతుంది. తద్వారా సాంఘిక న్యాయం హెచ్చుమందికి కలుగుతుంది.